సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 26 । మార్చి । 2025




టన్ను చీనీ రూ.25,020

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,020, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.8

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా రూ.6 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 90 టన్నుల టమాట వచ్చింది.



న్యూస్‌రీల్

పెరిగిన ఎండుమిర్చి ధర



మార్కెట్‌కు వచ్చిన మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధర పెరిగింది. మంగళవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 159 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో క్వింటా గరిష్ఠంగా రూ.15,400, కనిష్ఠంగా రూ.7,500, సరాసరిన రూ.13,500 ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. గత వారంతో పోలిస్తే క్వింటాపై రూ.500 మేర పెరిగిందని ఆయన వెల్లడించారు.

బెంగళూరు-కలబురిగి మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 28, 29వ తేదీల్లో బెంగళూరు–కలబురిగి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న బెంగళూరు జంక్షన్ నుంచి రాత్రి 9.15 గంటలకు బయలుదేరనున్న రైలు మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు కలబురిగి జంక్షన్‌కు చేరుతుందన్నారు. తిరిగి 29వ తేదీ ఉదయం 9.35 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు బెంగళూరు జంక్షన్ చేరుకుంటుందన్నారు. యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, కృష్ణా, యాద్గిరి, షాహాబాద్ రైల్వేస్టేషన్ల మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- చిన్న పొరపాటు కూడా జరగకూడదు
- జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి



ఎన్నికల అధికారులతో సమావేశమైన జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో ఈ నెల 27న జరగనున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ ఆర్.రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య ఆదేశించారు. మంగళవారం అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలోని సీఈఓ చాంబర్‌లో ప్రిసైడింగ్ అధికారులు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రొద్దం, గాండ్లపెంట, రామగిరి, కణేకల్లు, కంబదూరు మండలాల్లో ఎంపీపీ ఎన్నికలు, ఉరవకొండ, పెద్దపప్పూరు, యల్లనూరు, రాయదుర్గం మండలాల్లో వైస్ ఎంపీపీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా మండలాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు తావు లేకుండా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఎంపీటీసీ సభ్యులకు మాత్రమే ఎన్నుకునే హక్కు ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మండల కో–ఆప్షన్ సభ్యులకు ఓటింగ్ ఉండదన్నారు. మెజారిటీ సభ్యులు చేతులెత్తి మద్దతు తెలిపిన వారే ఎంపీపీ, వైస్ ఎంపీపీగా ఎన్నికవుతారన్నారు. ఎన్నికల రోజున బందోబస్తు కూడా ఉంటుందన్నారు.

- ఇది ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద కనిపించిన దృశ్యం. ఓ వ్యక్తి తప్ప తాగి నడిరోడ్డుపై కుక్కతో ఆడుకుంటూ నానా రభస చేశాడు. ప్రశాంతి నిలయం నిబంధనల ప్రకారం పుట్టపర్తికి చుట్టుపక్కల మద్యం దుకాణాలు నిర్వహించరాదు. అయితే నిబంధనలు తుంగలో తొక్కి అక్కడే మద్యం దుకాణం .. పక్కనే రూములు, అడిగిన చోటకు మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారు. దీంతో ఆధ్యాత్మిక కేంద్రాన్ని మందుబాబుల అడ్డాగా మార్చేశారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- ఇది హిందూపురం సమీపంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ బాలాజీ నేతృత్వంలో నిర్వహిస్తోన్న అనధికారిక బార్‌లా పిలిచే బెల్టు షాపు. దర్జాగా ఫ్రిజ్ ఏర్పాటు చేసి మరీ కూలింగ్ బీర్లు అమ్ముతున్నారు. పక్కనే ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఏర్పాటు చేశారు. డిజిటల్ పేమెంట్లకు ఫోన్ పే స్కానర్ కూడా అందుబాటులో ఉంచారు. ఆంధ్ర మద్యంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం బ్రాండ్లు కూడా దొరుకుతున్నాయని మందుబాబులు ఎగబడుతున్నారు.



ఊరూరా బెల్టు దందా



సాక్షి, పుట్టపర్తి

కాసులకోసం కూటమి పార్టీల నేతలు జనానికి అక్రమ కిక్కు ఎక్కిస్తున్నారు. ఊరూరా 'బెల్టు' షాపులు ఏర్పాటు చేసి తాగినోళ్లకు తాగినంత తాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. దీంతో గుడి, బడి తేడా లేకుండా జిల్లాలో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అడ్డుకోవాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో ఏ గ్రామంలో చూసినా బెల్టు షాపులు దర్శనం ఇస్తున్నాయి. ప్రధాన రహదారులు, పట్టణాల్లో సైతం బార్‌లను తలపించే విధంగా బెల్టు దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఇక లైసెన్సు పొందిన మద్యం దుకాణాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా రూములు ఏర్పాటు చేశారు. క్వార్టర్‌పై రూ.50 నుంచి రూ.100 వరకు అధికంగా పిండుకుంటున్నారు.

బార్లా తెరిచేశారు

- విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- గుడి, బడి తేడా లేకుండా అమ్మకాలు
- అక్రమార్జనే ధ్యేయంగా కూటమి నేతలు
- ఆధ్యాత్మిక కేంద్రాలనూ వదలని 'తమ్ముళ్లు'
- బార్‌లను తలపించేలా బెల్టు షాపులు
- ఇష్టారాజ్యంగా పర్మిట్ రూముల ఏర్పాటు

లేబుల్ మార్చి దోపిడీ

లోకల్‌గా మద్యం తయారు చేసి.. సీసాలపై ఆర్మీ లేబుళ్లు.. ఇతర రాష్ట్రాల మద్యం బ్రాండ్ల పేర్లతో కూడిన లేబుళ్లు వేసి విక్రయాలు సాగిస్తున్నారు. సినీనటుడు నందమూరి బాలకృష్ణ ప్రాతినిథ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలో ఎక్కువగా లేబుల్ మార్చి దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అంతే కాకుండా ఇతర రాష్ట్రాల మద్యాన్నీ భారీగా డంప్ చేసి విచ్చల విడిగా విక్రయాలు చేస్తున్నారు. ఈక్రమంలోనే ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇతర రాష్ట్రాల మద్యాన్ని పట్టుకున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్న క్రమంలో లేపాక్షిలోని షాపునకు రూ.5 లక్షల జరిమానా విధించారు. అదేవిధంగా అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో చిలమత్తూరులోని వైన్ షాపును సీజ్ చేశారు. ఎక్సైజ్ ఉన్నతాధికారులు రంగంలోకి దిగిన ప్రతిసారీ కొత్త ఘటన వెలుగు చూస్తుండటం గమనార్హం.



హిందూపురంలో మద్యం దుకాణం పక్కనే ఏర్పాటు చేసిన అనధికారిక రూము

పర్మి(నెం)ట్ కిక్కు

జిల్లా వ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా తాగేందుకు రూములు ఏర్పాటు చేశారు. బార్ అండ్ రెస్టారెంట్ తరహాలో అక్కడే తినుబండారాలు తయారీ చేసి.. సిట్టింగ్‌లకు అనుమతులు ఇస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న మద్యం దుకాణాల్లో అయితే మందుబాబుల కోసం ఏకంగా కొట్టాలు వేసి ఏర్పాట్లు చేయడాన్ని చూసి జనమే ముక్కున వేలేసుకుంటున్నారు. కొన్నిచోట్ల ఇంటి వద్దకే మద్యం డెలివరీ చేసే వ్యవస్థను తీసుకొచ్చారు.

ఎక్సైజ్ స్టేషన్ల వారీగా అమ్మకాలు ఇలా..

(2024 అక్టోబర్ 16 నుంచి 2025 మార్చి 24 వరకు)

ధర్మవరం	రూ.65.68 కోట్లు
పెనుకొండ	రూ.45.93 కోట్లు
హిందూపురం	రూ.44.99 కోట్లు
కదిరి	రూ.42.25 కోట్లు
పుట్టపర్తి	రూ.35.51 కోట్లు
మడకశిర	రూ.21.76 కోట్లు
తనకల్లు	రూ.21.03 కోట్లు
సీకే పల్లి	రూ.15.96 కోట్లు

ఆలయ సమీపంలోనే...

రామగిరి మండలం నసనకోట ముత్యాలమ్మ ఆలయానికి స్థానికులతో పాటు కర్ణాటక నుంచి భక్తులు వస్తారు. ముత్యాలమ్మపల్లిలో ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో జాతరను తలపిస్తుంది. మొక్కుచెల్లింపులో భాగంగా వందలాది యాటలు తెగుతాయి. ఇక మందుబాబుల డిమాండ్‌కు అనుగుణంగా కూటమి నేతలు ఆలయ సమీపంలోనే బెల్టు షాపు తెరిచారు. పూటుగా తాగుతున్న మందుబాబులు పవిత్రమైన స్థలంలో నానా హంగామా చేస్తున్నారు. ఆలయ ప్రతిష్టను దిగజారుస్తున్నారు. మద్యం మత్తులో కొందరు ఆలయంలో ప్రవేశించి హుండీ చోరీ చేశారు.

96
జిల్లాలో మద్యం దుకాణాలు

10
జిల్లాలోని బార్ల సంఖ్య

రూ.293.15 కోట్లు
2024 అక్టోబరు 16 నుంచి ఈనెల 24 వరకు మద్యం అమ్మకాలు

37,78,227 లీటర్లు
వివిధ బ్రాండ్‌ల మద్యం విక్రయాలు

12,68,152 లీటర్లు
బీర్ల విక్రయాలు

ఉపేక్షించేది లేదు



లైసెన్సు పొందిన దుకాణాల్లో మాత్రమే మద్యం విక్రయాలు జరగాలి. ఎమ్మార్పీకి మించి అమ్మితే చర్యలు తప్పవు. కేవలం ఆంధ్ర మద్యం మాత్రమే అమ్మాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. ఎవరినీ ఉపేక్షించేది లేదు. బెల్టు షాపులకు అనుమతులు ఇవ్వబోం. ఫిర్యాదులు వచ్చిన వెంటనే తనిఖీలు చేసి బెల్టు షాపుల ఆట కట్టిస్తున్నాం.

– గోవిందనాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పుట్టపర్తి

అట్రాసిటీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

- అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని జిల్లాలో పక్కాగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్సీ, ఎస్టీ జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టం అమలుపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఇప్పటి వరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులు.. పరిష్కరించిన కేసుల వివరాలను సంబంధిత శాఖల అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ... ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్, విజిలెన్స్ కమిటీ సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో బాధితులకు న్యాయం జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంవత్సరానికి మానిటరీ రిలీఫ్ రూ.4.35 కోట్లు మంజూరైందని, ఇప్పటి వరకు రూ.2.41 కోట్లు బాధితుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశామన్నారు. మిగిలిన మొత్తాన్ని వారం రోజుల్లో బాధితుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. భూతగాదాలు పరిష్కరించేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. అనంతరం పోలీస్, డీఆర్‌డీఏ, రెవెన్యూ శాఖల అధికారులు తమ పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పురోగతి, బాధితులకు అందించిన పరిహారం వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలపై జరిగిన దాడుల ఘటనలను వివరించారు. సమావేశంలో పుట్టపర్తి, పెనుకొండ ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్, పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి పద్మమ్మ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు వీరనారాయణ, శ్రీనివాస్ నాయక్, ఉమాశంకర్, కృష్ణమూర్తి, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల భద్రత, సంక్షేమానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్కావెంజర్ పనితీరుపై త్రైమాసిక జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు, మాస్కులు వంటి అత్యవసర సామగ్రి తప్పక అందించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించేందుకు జిల్లా పంచాయతీ, మున్సిపల్ కమిషనర్లు కృషి చేయాలన్నారు. పారిశుధ్య కార్మికుల నూతన జాబితాను రూపొందించి అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్‌డీఎం రమణకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్లు ప్రహ్లాద్, శ్రీనివాసులు, రంగస్వామి, కిరణ్‌కుమార్, ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల



లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షా ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. పరీక్షకు 7,987 మంది దరఖాస్తు చేసుకోగా, 5,492 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. అందులో 80 మంది అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హత సాధించిన విద్యార్థుల రోల్ నంబర్లు ఇలా...

జే1000385	జే1000012	ఐ1005931	ఎన్1006682
ఎల్1002764	ఐ1000356	పి1006428	జే 1007240
జి 1005236	ఎం1000576	ఎల్1006502	జే1007407
ఎన్1005523	జే1000580	జే1006568	జే1007799
ఐ1007174	ఎం1001453	ఐ1007079	జే1007932
ఎం1007585	ఎం1001799	ఎం1007255	ఎన్1007950
ఎన్1007629	ఐ1001845	ఎం1007263	కే1000027
పీ1007898	ఐ1002891	ఎన్1007529	కే1000637
జే1000718	కే1002923	ఎన్1007595	కే1001782
జే1002993	ఐ1003540	ఎన్1007952	కే1003235
బి1004210	ఎం1003662	జే1000812	ఓ1003503
జే1005888	ఐ1003860	జే1001555	ఓ1006002
జే1007359	ఎన్1003984	జే1003446	కే1006268
కే1003679	ఎన్1004015	జే1003577	కే1007104
కే1004027	ఓ1004216	జే1003625	ఓ1007896
సీ1005172	జే1004436	జే1003688	ఎల్1000099
ఐ1002639	జే1004527	జే1004148	ఎల్1000449
ఎం1002714	ఎల్1005290	ఎన్1004227	ఎల్1000743
ఎం1007958	ఎల్1005445	జే1004523	ఎల్1001221
ఎల్1000114	జే1005880	ఎన్1005013	ఎల్1007122

9వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయలో 9వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి.

ఎంపికైన విద్యార్థుల రోల్ నంబర్లు ఇలా...

100327	100349	100403	100636	100675
100731	100741	100109	100561	100217

30 గ్రామాలకు సత్యసాయి నీరు బంద్



కల్వర్టు కింద విరిగిన పైపులైను జాయింట్ కప్లింగ్



మరమ్మతులు చేస్తున్న సత్యసాయి పథకం సిబ్బంది

- మెయిన్ పైపు లీక్ కావడమే కారణం
- మూడు రోజులుగా శ్రమిస్తున్నా దక్కని ఫలితం

బత్తలపల్లి: సత్యసాయి తాగునీటి పథకం...ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వందలాది గ్రామాలకు తాగునీరు అందిస్తోంది. ఈ పథకానికి సంబంధించిన పైప్‌లైన్ లీక్ కావడంతో బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం మండలాల్లోని 30 గ్రామాలక నీటి సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది మూడు రోజులుగా శ్రమిస్తున్నా ఫలితం లేకపోయింది. వేసవి ప్రారంభమవడంతో పలు గ్రామాల్లో నీటి సమస్య ఉత్పన్నమైంది. ఈ నేపథ్యంలో సత్యసాయి నీరు కూడా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటికి అల్లాడిపోతున్నారు.

కప్లింగ్ విరిగిపోవడంతో సమస్య

చిత్రావతి నది నుంచి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి సత్యసాయి తాగునీటి పథకం ద్వారా నీరు సరఫరా అవుతోంది. ఈ పథకం ప్రధాన పైపులైన్ బత్తలపల్లి మీదుగా నాలుగు లేన్ల జాతీయ రహదారి కింద వెళ్తోంది. బత్తలపల్లి పోలీస్ స్టేషన్ సమీపాన జాతీయ రహదారి కల్వర్టు కింద ప్రధాన పైపులైను జాయింట్ కప్లింగ్ విరిగిపోవడంతో సత్యసాయి నీరు లీకేజీ అవుతున్నట్లు మూడు రోజుల క్రితం సిబ్బంది గుర్తించారు. సత్యసాయి తాగునీటి పథకం సూపర్‌వైజర్లు శంకరయ్య, రాజారెడ్డి పర్యవేక్షణలో దాదాపు 20 మంది సిబ్బంది జాతీయ రహదారి మధ్యలో సుమారుగా 20 అడుగుల లోతు తవ్వి కప్లింగ్ వేసేందుకు మూడు రోజులుగా శ్రమిస్తున్నారు. మంగళవారం రాత్రికి పైపులైనుకు జాయింట్ కప్లింగ్ తొడిగించి పనులు పూర్తి చేసి బుధవారం సత్యసాయి నీరు అందేలా చూస్తామని సత్యసాయి మంచినీటి పథకం సూపర్‌వైజర్లు వెల్లడించారు.

ఎస్టీలైనా విద్యుత్ బిల్లు చెల్లించాల్సిందే

- ధర్మపురి ఎస్టీ కాలనీ వాసులతో విద్యుత్ శాఖ అధికారుల వాగ్వాదం



విద్యుత్‌శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగిన ధర్మపురి ఎస్టీ కాలనీ వాసులు

ధర్మవరం రూరల్: ఎస్టీలైనా సరే కరెంటు బిల్లులు చెల్లించాల్సిందేనని, లేకపోతే విద్యుత్ సర్వీసు వైర్లను తొలగిస్తామని విద్యుత్ శాఖ అధికారులు మండలంలోని ధర్మపురి కాలనీ వాసులను హెచ్చరించారు. అంతే కాకుండా పోలీసులను రంగంలోకి దించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

బకాయిల పేరుతో భయపెడుతూ...

ధర్మవరం మండలం ధర్మపురి గ్రామంలోని ఎస్టీ కాలనీకి మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు వెళ్లారు. కాలనీకి చెందిన 40 మంది విద్యుత్ బకాయిలు ఉన్నారని, వెంటనే చెల్లించకపోతే సర్వీసులు తొలగిస్తామన్నారు. దీంతో ఎస్టీలంతా అధికారులతో వాగ్వాదం చేశారు. ప్రభుత్వం ఎస్టీలకు ఉచిత కరెంటు ఇస్తుంటే... మీరొచ్చి బిల్లులు చెల్లించాలని బెదిరించడం అన్యాయమన్నారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, విద్యుత్ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ధర్మవరం రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని కాలనీ వాసులకు సర్ది చెప్పారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ జానకి రామయ్య మాట్లాడుతూ.. ఎస్టీ కాలనీలోని 40 మంది సర్వీసులపై రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకు బిల్లులు బకాయి ఉన్నాయన్నారు. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు మాత్రమే ఉచితంగా విద్యుత్ ఇస్తుందన్నారు. ఆ తర్వాత బిల్లు వేస్తుందన్నారు. ఈ క్రమంలోనే వేలకు వేలు బిల్లులు పెండింగ్‌లో ఉన్న వారితో బిల్లులు వసూలు చేయాలని తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. అనంతరం అధికారులతో చర్చల తర్వాత ఏప్రిల్ 10వ తేదీలోపు కొంత మొత్తం చెల్లిస్తామని గిరిజనులు చెప్పడంతో విద్యుత్ శాఖ అధికారులు వెళ్లిపోయారు. కాగా, మొదటి నుంచి ప్రభుత్వమే ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇస్తుండగా...తాము బకాయి ఎందుకు ఉన్నామో అర్థం కావడం లేదని పలువురు వాపోయారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ దూసుకెళ్లి చిన్నారి దుర్మరణం


వరుణ్ (ఫైల్)

పావగడ: ట్రాక్టర్ దూసుకెళ్లడంతో ఓ చిన్నారి దుర్మరనం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకా వైఎన్ హొసకోట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిక్కజాలోడు గ్రామానికి చెందిన వరుణ్ (6) తిమ్మమ్మనహళ్లిలోని తన అమ్మమ్మ ఇంటికి ఇటీవల వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో ఇంటి ఎదుట ఆడుకుంటుండగా అటుగా మట్టి లోడుతో వచ్చిన ట్రాక్టర్ ఢీకొని చిన్నారి మీదుగా దూసుకెళ్లింది. ఘటనలో ట్రాక్టర్ చక్రాల కింద నలిగి వరుణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై వైఎన్ హొసకోట పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ మాళప్ప నాయక్కొడి తెలిపారు.

కానిస్టేబుల్ మురళి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న మురళి

కదిరి టౌన్: స్థానిక పీఎస్‌లో స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మురళి మంగళవారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేశాడు. రాప్తాడు మండలం జంగాలపల్లికి చెందిన మురళి... కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మూర్తిపల్లి సచివాలయ మహిళా పోలీసుగా పనిచేస్తున్న ఓడీసీ మండలం డబురువారిపల్లికి చెందిన కల్పనను ప్రేమించి ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో గ్రూప్ 1 పరీక్షలకు సిద్ధమైన ఆమెను కోచింగ్ కోసం రెండు నెలల క్రితం అనంతపురానికి పంపాడు. పరీక్ష రాసిన తర్వాత నేరుగా పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భర్తతో దూరంగా ఉంటూ వచ్చింది. పలుమార్లు కాపురానికి రావాలని పిలిచినా ఆమె అంగీకరించకపోవడంతో మనస్తాపం చెందిన మురళి... మంగళవారం రాత్రి వైఎస్సార్ నగర్‌లో తాను నివాసముంటున్న ఇంట్లోనే పురుగుల మందు సేవించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆయనను పక్కింటి వారు గమనించి, వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

గ్రామీణ విద్యార్థులు... పతకాల వీరులు


వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న డీఈఓ కృష్ణప్ప

- క్రీడల్లో రాణిస్తున్న బుక్కపట్నం విద్యార్థులు
- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాల కైవసం

పుట్టపర్తి: వసతులు లేవు... క్రీడా సామగ్రి లేదు... సాధన చేసేందుకు సరైన మైదానమూ లేదు. అయినా వారు పట్టు వీడలేదు. గత ఐదేళ్లలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విశేష ప్రతిభతో రాణిస్తున్నారు. బుక్కపట్నంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు. పట్టుదల.. కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చునని నిరూపించారు.

ఏటా పతకాల వర్షం

బుక్కపట్నంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు 2019 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ ఏటా క్రమం తప్పకుండా క్రీడా పోటీల్లో పాల్గొంటూ పతకాలను సొంతం చేసుకుంటున్నారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు గణేష్‌రెడ్డి, సుభాష్, ముక్తియార్, చరణ్ ప్రకాష్, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, హాకీ, ఏపీ స్కూల్ గేమ్స్‌లలో రాణించి, పతకాలతో మెరిసారు. 2019లో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో 65, 95, 125 కిలోల బరువెత్తి తొలిసారిగా రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ప్రకాష్ ఎంపికయ్యాడు. ఆ తర్వాత క్రీడలపై విద్యార్థుల్లో ఆసక్తి మొదలైంది. దీంతో విద్యార్థులకు ఆసక్తి ఉన్న వివిధ క్రీడల్లో వారిని ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తూ వచ్చారు. 2022–23లో విజయవాడ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గణేష్‌రెడ్డి, చరణ్, ముక్తియార్ ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వీరిలో సుభాష్ బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం విశేషం. ఈ విద్యా సంవత్సరంలో పవర్ లిఫ్టింగ్‌లో రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గణేష్ రెడ్డి అద్భుత ప్రదర్శన కనబరిచి బంగారు పతకాన్ని సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

దాతల సహకారంతోనే..



పాఠశాలలో క్రీడా సామగ్రి కొరత చాలా ఉంది. సరైన మైదానం కూడా లేదు. దాతల సహకారంతో క్రీడా సామగ్రిని కొనుగోలు చేసి విద్యార్థులకు రోజూ శిక్షణ ఇస్తున్నాం. ఫలితంగా వారు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు గుర్తింపు తెచ్చారు.

– నాగరాజు, పీడీ, బాలుర ఉన్నత పాఠశాల, బుక్కపట్నం

జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తా..



వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయిలో రాణించి బంగారు పతకాన్ని సాధించాలని ఉంది. ఆ దిశగా సాధన చేస్తున్నా. పాఠశాలలో సౌకర్యాలు లేకపోయినప్పటికీ హెచ్‌ఎం జగదీశ్వర్, పీడీ నాగరాజు ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నా.

– సుభాష్, విద్యార్థి

బంగారు పతకం నాదే



ఇప్పటికే పవర్ లిఫ్టింగ్‌లో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాన్ని సాధించాను. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లోనూ బంగారు పతకం నాదే అవుతుంది. ఈ కలను సాకారం చేసుకునేందుకు ఇప్పటి నుంచే క్రమం తప్పకుండా సాధన చేస్తున్నా.

– గణేష్‌రెడ్డి, విద్యార్థి

చాలా ఆనందంగా ఉంది



మా పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో రాణిస్తుండడం చాలా ఆనందంగా ఉంది. దాతల సహకారంతో క్రీడా సామగ్రిని సమకూర్చుకొని విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం.

– జగదీశ్వర్, హెచ్‌ఎం, బాలుర ఉన్నత పాఠశాల, బుక్కపట్నం.

'మార్కెటింగ్' టార్గెట్ రూ.19.79 కోట్లు

- ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీలకు లక్ష్యం నిర్దేశించిన ఆర్జేడీ


రెండు జిల్లాల ఏడీలు, సెక్రటరీలతో సమావేశమైన మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజినేయులు

అనంతపురం అగ్రికల్చర్: ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉమ్మడి అనంతపురం జిల్లా మార్కెట్ కమిటీలకు రూ.19.79 కోట్ల పన్ను వసూళ్లను లక్ష్యంగా మార్కెటింగ్‌శాఖ నిర్దేశించింది. మంగళవారం అనంతపురంలోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజినేయులు సమక్షంలో రెండు జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎస్ మూర్తి, 17 మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లు సమావేశమయ్యారు. 2024–25లో నిర్దేశించిన టార్గెట్లు, సాధించిన ప్రగతిపై సమీక్షిస్తూనే వచ్చే ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్లు, బడ్జెట్ తదితర అంశాలపై మార్కెట్ కమిటీల వారీగా చర్చించారు. అనంతపురం జిల్లా పరిధిలో ఉన్న 9 మార్కెట్ కమిటీకు రూ.13.93 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న 8 మార్కెట్ కమిటీలకు రూ.5.86 కోట్లు టార్గెట్ నిర్దేశించారు. ప్రస్తుత 2024–25లో రూ.5.31 కోట్లకు గానూ వంద శాతం సాధించే దిశగా మార్కెట్ కమిటీలు పయనిస్తున్నట్లు తెలిపారు. దీంతో రెండు జిల్లాలకు అదనపు టార్గెట్లను కలిసి రూ.19.79 కోట్లు నిర్దేశిస్తున్నట్లు ఆర్జేడీ తెలిపారు. ఎక్కడా లీకేజీలు లేకుండా వంద శాతం ఫీజు వసూళ్లపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటికే వంద శాతం పూర్తయిన మార్కెట్ కమిటీ సెక్రటరీలను అభినందించారు.

'విజన్-2047' ఓ మాయ

- ప్రజాసమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి విజన్ –2047 పేరుతో మాయ చేసేందుకు పూనుకుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ మండిపడ్డారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం బకాయిలు చెల్లించాలని, హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలని, హిందూపురంలోని ప్రీకాట్ మిల్లు కార్మికులను ఆదుకోవాలంటూ మంగళవారం కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయని సీఎం చంద్రబాబు పీ–4 అంటూ కొత్త నాటకానికి తెరతీశారని మండిపడ్డారు. పేదలు గుడిసెలు వేసుకుంటే జేసీబీలతో తొలగించే ప్రభుత్వం.. కూటమి నాయకులతో మాత్రం విచ్చలవిడిగా భూ కబ్జాలకు తెరతీసిందన్నారు. హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ పనులు చేపడితే అడ్డుకుంటామన్నారు. ప్రీకాట్ మిల్లు కార్మికులు వీధిన పడకుండా ఆదుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలు కేటాయించాలన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి, పంటల సాగుకు నీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదిర్శ వర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేషులు, నాయకులు హరి, జంగాలపల్లి పెద్దన్న, దిల్షాద్, జెడ్పీ శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, పెద్దన్న, పవన్, పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా, పలువురు మహిళలు పాల్గొన్నారు.

జగనన్నను విమర్శించే స్థాయి నీకెక్కడిది?

- మంత్రి సవితపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజం


మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

పరిగి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి అడ్డదారిలో ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సవితకు లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. మంగళవారం పరిగి మండలం తిరుమలదేవరపల్లిలో పర్యటించిన ఆమె స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత సోమవారం కాంగ్రెస్ పార్టీ వైపు వైఎస్ జగన్ చూస్తున్నారంటూ మంత్రి సవిత మాట్లాడిన తీరును ఆక్షేపించారు. సవిత ఎన్నటికీ రాజకీయాలకు పనికిరారన్నారు. అవగాహన లేకుండా మాట్లాడితే ఉన్న పరువు కాస్త పోతుందని గ్రహించాలని హితవు పలికారు. వైఎస్ జగన్ ఎప్పటికీ సింగిల్‌గానే వస్తారని, ఆయనకు ఎవరి మద్దతూ అవసరం లేదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీతో అంటకాగి వైఎస్ జగన్‌ను అణగదొక్కాలని చూసిన చంద్రబాబు కుట్రలు రాష్ట్ర ప్రజలకు తెలియనివి కావన్నారు. కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని కుట్రలు చేసినా జగనన్నను ఎదుర్కోలేరన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సవిత... బీసీలకు చేసిన మేలు ఏదైనా ఒక్కటి ఉంటే చెప్పాలని, ఆమెలో ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా... బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని సవాల్ విసిరారు. పరిగి మండలం కొడిగెనహళ్లి ప్రీకాట్ స్పిన్నింగ్ మిల్లు మూసివేతతో రోడ్డున పడిన కార్మిక కుటుంబాలకు చేనేత జౌళీ శాఖ మంత్రిగా ఆమె చేసిన న్యాయమేమిటో చెప్పాలని ప్రశ్నించారు. నాలుగు దశాబ్దాలుగా పరిగి, పెనుకొండ, మడకశిర, హిందూపురం ప్రాంతాలతో పాటూ బిహార్, ఒడిశా రాష్ట్రాల వలస కార్మికులకు జీవనోపాధిని అందించిన ఫ్యాక్టరీ నేడు మూత పడడానికి కూటమి ప్రభుత్వ వైఖరే కారణమన్నారు. తన ఇలాఖాలో ఓ మిల్లు మూతపడిదంటే జౌళీ శాఖ మంత్రిగా ఆమె సిగ్గుపడాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు పెంచుతామంటూ ఉన్న పరిశ్రమలను మూత పడేలా చేయడం చంద్రబాబు సర్కార్‌కే సాధ్యమన్నారు. కురుబ కులంలో పుట్టిన సవిత... గుడికట్ల పూజారులకు నెలకు రూ.5వేలు గౌరవవేతనం చెల్లిస్తామంటూ ఇచ్చిన హామీ ఏమైందన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలపై ఆరోపణలు చేయడం మాని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలని హితవు పలికారు.

స్టాక్ పాయింట్ వద్ద డీలర్ల ధర్నా

గోరంట్ల: చౌకధాన్యపు డిపోల పరిధిలోని లబ్ధిదారులకు సరిపడే అన్ని రకాల నిత్యావసర సరుకులు అందజేయాలంటూ గోరంట్లలోని స్టాక్ పాయింట్ ఎదుట మండలంలోని స్టోర్ డీలర్లు మంగళవారం ధర్నా చేపట్టారు. కార్డుదారులకు సరిపడేంత సరుకులు, బియ్యం ఇవ్వకుండా, అలాట్‌మెంట్ కుందించి ఇస్తుండటంతో లబ్ధిదారులకు సమాధానం చెప్పుకోలేక పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో స్టాక్ పాయింట్ అధికారులు కేటాయించిన అలాట్‌మెంట్ కంటే రెండు మూడు క్వింటాళ్లు అదనంగా స్టోర్ల ద్వారా ప్రజలకు అందించినా... ఏప్రిల్‌కు సంబంధించిన కోటాలో ఒక్కో స్టోరుకు సగటున 20 క్వింటాళ్ల బియ్యం తక్కువగా అలాట్‌మెంట్ వేయడంపై అసహనం వ్యక్తం చేశారు. మందలపల్లి ఎస్సీ కాలనీకి సంబంధించిన 34వ స్టోర్‌కు బియ్యం కోటా అలాట్‌మెంట్ చేయలేదని, ఇదే విషయాన్ని సీఎస్‌డీటీకి వివరించేందుకు వెళితే ఆయన కార్యాలయానికి రాకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలపై రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు.

గైనకాలజిస్ట్‌కు 'షోకాజ్'

సాక్షి ఎఫెక్ట్..

కదిరి అర్బన్: స్థానిక ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ విజయలక్ష్మికి షోకాజ్ నోటీసును ఉన్నతాధికారులు జారీ చేశారు. ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే రోగులను స్కానింగ్‌ల కోసం ప్రైవేట్ సెంటర్లకు రెఫర్ చేస్తున్న వైనంపై ఈ నెల 25న 'తీరు మారదు.. కక్కుర్తి తీరదు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గైనకాలజిస్టుకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి టౌన్ (యాడికి): మండల కేంద్రం యాడికి గ్రామానికి చెందిన బలరాముడు (32) ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసగా మారి కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడంతో భార్య సుమాంజలి తరచూ నిలదీస్తూ వచ్చేది. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ వద్ద నిర్జన ప్రదేశంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి

అనంతపురం: అంతర్‌జిల్లా దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.16 లక్షల విలువైన 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి వెల్లడించారు. అనంతపురంలోని భవానీనగర్‌లో నివాసముంటున్న వనరస జితేంద్ర అలియాస్ సిద్ధు, షేక్ తౌహిద్ అలియాస్ సోనూ, ఇందిరానగర్‌కు చెందిన మైనర్ బాలుడు, శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం ముత్యాల చెరువు గ్రామానికి చెందిన నల్లనాచప్పగారి గణేష్, ముత్యాలచెరువు గ్రామానికి చెందిన నూర్ మహమ్మద్ వ్యసనాలకు బానిసలుగా మారి, తమ జల్సాలు తీర్చుకునేందుకు మూడు బృందాలుగా ఏర్పడి అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించేవారు. వీరిలో జితేంద్రపై అనంతపురం రెండు, మూడు, రూరల్, గుత్తి పీఎస్ పరిధిలో మొత్తం 8 కేసులున్నాయి. ఇది వరకే సాగించిన దొంగతనాలకు సంబంధించి 2 కేసులున్నాయి. కార్పెంటర్‌గా పనిచేస్తున్న తౌహిద్, తన స్నేహితుడు (మైనర్)తో కలసి ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలను అపహరించేవాడు. వీరిపై అనంతపురం వన్‌టౌన్, ధర్మవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిల్లో చెరో 6 కేసులున్నాయి. మైనర్‌పై రెండు బైక్ చోరీ కేసులున్నాయి. బేల్దారి నల్లనాచప్పగారి గణేష్, బైక్ మెకానిక్ నూర్ మహమ్మద్ ఇద్దరూ ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో మంచి స్నేహితులయ్యారు. జల్సాలకు అవసరమైన డబ్బు కోసం ద్విచక్ర వాహనాలను అపహరించేవారు. వీరిపై మొత్తం ఆరు కేసులుండగా ఇందులో వైఎస్సార్ జిల్లాలో ఐదు, అనంతపురం జిల్లాలో ఒకటి ఉన్నాయి. నిందితులు మంగళవారం అనంతపురంలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాలు వద్ద తచ్చాడుతుండగా అనంతపురం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, త్రీ టౌన్ సీఐ శాంతిలాల్, సీసీఎస్ సీఐలు ఇస్మాయిల్, జైపాల్‌రెడ్డి గుర్తించి అరెస్ట్ చేశారు. మైనర్‌ను సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచారు. మిగిలిన వారిని న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఈ గ్రామాల్లో కొత్త బోరుబావుల తవ్వకంపై నిషేధం

- 'అనంత'లో 13 గ్రామాలు, 'శ్రీ సత్యసాయి'లో 51 గ్రామాలు
- రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్



అనంతపురం అగ్రికల్చర్: ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి, వృక్షముల చట్టం-వాల్టా (ఏపీ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీ యాక్ట్-2002) ప్రకారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 64 గ్రామ పంచాయతీల్లో కొత్తగా బోరుబావుల తవ్వకాన్ని నిషేధిస్తూ జారీ చేసింది. ఆయా గ్రామాల్లో అత్యధిక నీటి వినియోగం ఉన్నట్లు గుర్తించారు. అత్యవసరమైతే ఉన్నతాధికారుల అనుమతితోనే తాగునీటి అవసరాల కోసం మాత్రమే బోరుబావుల తవ్వకం చేయాలని స్పష్టం చేసింది.

- పుట్లూరు మండలం కోమటికుంట్ల, మడుగుపల్లి, తాడిపత్రి మండలం బోడాయిపల్లి, బొందలదిన్నె, హుస్సేనాపురం, సజ్జలదిన్నె, తాడిపత్రి రూరల్ పంచాయతీ, యల్లనూరు మండలం అరవేడు, బొప్పేపల్లి, మేడికుర్తి, పెద్దమల్లేపల్లి, తిరుమలాపురం, వేములపల్లె గ్రామ పంచాయతీలు ఉన్నాయి.
- రాష్ట్ర వ్యాప్తంగా 8 జిల్లాల పరిధిలో 300 గ్రామ పంచాయతీలను 'వాల్టా' పరిధిలోకి తీసుకొచ్చారు. అందులో అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 94 గ్రామాలు ఉన్నాయి. ఆ తర్వాత శ్రీకాకుళం- 76, శ్రీ సత్యసాయి-51, వైఎస్సార్ కడప-32, చిత్తూరు- 18, పల్నాడు- 16, అనంతపురం -13, అన్నమయ్య జిల్లాలో ఒక గ్రామం... ఇలా మొత్తం 300 గ్రామాల్లో 'వాల్టా' అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు భూగర్భజలశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.తిప్పేస్వామి తెలిపారు.

జిల్లా పరిధిలో..

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో అత్యధికంగా 51 గ్రామాల్లో 'వాల్టా' పరిధిలోకి తీసుకొచ్చారు. అందులో అగళి మండలం హుళ్లికెర దేవరహళ్లి, ఇనగలూరు, మధూడి, నరసంబూడి, పి.బ్యాడిగేరె, రావుడి, అమడగూరు మండలం కరిణిరెడ్డిపల్లి, లోకోజిపల్లి, అమరాపురం మండలం తమ్మిడేహళ్లి, చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి, హుస్సేనాపురం, గాండ్లపెంట మండలం చామచాయనబైలు, చామలగొంది, గాండ్లపెంట, జీనుగులకుంట, కురుమామిడి, మడుగువానిగొంది, సోమయాజుపల్లి, గుడిబండ మండలం జి.మోరుబాగల్, కేకాతి, ఎస్.రాయాపురం హిందూపురం మండలం దేవరపల్లె, గోళ్లాపురం, కిరికెర, కొటిపి, కొట్నూరు, మలుగూరు, మణేసముద్రం, శ్రీకంఠాపురం రూరల్, లేపాక్షి మండలం చోళసముద్రం, ఎన్‌పీ కుంట మండలం ఎదురుదొన, గూటిబయలు, గొకనపల్లి, ముడుపలజూవి, రొద్దం మండలం చెరకూరు, రొళ్ల మండలం బొమ్మగుండనహళ్లి, దొడ్డేరి, కాకి, ఎం.రాయాపురం, రొళ్ల, తాడిమర్రి మండలం దాడితోట, తలుపుల మండలం పులిగుండ్లపల్లె, తనకల్లు మండలం అగ్రహారంపల్లె, బాలసముద్రం, బొంతలపల్లె, చీకటిమానిపల్లి, దిగువమందలపల్లి, గుర్రంబయలు, కోటపల్లె, మద్దినాయనిపాలెం, టి.సదుంలు ఉన్నాయి.

బాలుడి అదృశ్యం


నాగచైతన్య

ధర్మవరం అర్బన్: స్థానిక ఇందిరమ్మకాలనీకి చెందిన 11 ఏళ్ల బాలుడు కనిపించకుండా పోయాడు. ఈ మేరకు టూటౌన్ సీఐ రెడ్డప్ప మంగళవారం తెలిపారు. ఇందిరమ్మకాలనీకి చెందిన నరసింహులు, సుమలత దంపతుల కుమారుడు గుజ్జల నాగచైతన్య సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి, బాలుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



లేడీ బౌన్సర్స్‌కు
అడ్డే లేదు

స్త్రీలను కొన్ని ఉపాధుల్లోకి రానీకుండా అడ్డుకుంటారు. అడ్డుకునేవారిని అడ్డుకుంటాం అంటున్నారు ఈ లేడీ బౌన్సర్లు. కొచ్చి, పూణె, ఢిల్లీ, ముంబైలలో లేడీ బౌన్సర్లకు గిరాకీ పెరిగింది. సెలబ్రిటీలను గుంపు నుంచి అడ్డుకుని వీరు కాపాడుతారు. స్పోర్ట్స్, మార్షల్ ఆర్ట్స్, బాడీ బిల్డింగ్ తెలిసిన స్త్రీలు ఈ రంగాన్ని ఎంచుకుంటున్నారు. రోజుకు రెండు వేల వరకూ ఫీజు. వివాహితలూ ఉన్నారు. వివరాలు...

ఎనిమిది గంటలు డ్యూటీ. తీసుకెళ్లడం తీసుకు రావడం ఏజెన్సీ పని. భోజనం ఉంటుంది. బయట ఊర్లయితే రూము కూడా ఇస్తారు. రోజుకు రెండు వేల నుంచి రెండు వేల ఐదు వందలు సంపాదన. చేయాల్సిన పని?

- క్రౌడ్‌ను కంట్రోల్ చేయడం
- ఈవెంట్ సెక్యూరిటీ
- సెలబ్రిటీల రక్షణ
- సెలబ్రిటీలను ఎయిర్‌పోర్ట్ నుంచి రిసీవ్ చేసుకోవడం
- సంపన్నుల వేడుకల్లో హంగామా కోసం
- ప్రయివేటు సమస్యల్లో రక్షణ

ఇటీవల ఒక సినీ నటుడి ఇంటి గొడవల్లో బౌన్సర్లనే మాట ఎక్కువగా వినిపించింది. పోలీసుల రక్షణ వీలుగాని చోట ప్రముఖులు బౌన్సర్ల సాయం తీసుకోవడం సాధారణం అయ్యింది. ఒకప్పుడు పబ్‌లలో తాగి గొడవ చేసే వారి కోసం మాత్రమే బౌన్సర్లు ఉండేవారు. ఇప్పుడు అన్ని సేవలకు వారిని ఉపయోగిస్తున్నారు. సెక్యూరిటీకి మాత్రమే కాదు దర్పం చూపించడానికి కూడా శ్రీమంతులు బౌన్సర్లను వాడుతున్నారు. ఉదాహరణకు కలవారి పెళ్లిళ్లలో వరుడు/వధువు కల్యాణ వేదికకు వచ్చేప్పుడు వరుసదీరిన బౌన్సర్లు చెరో పక్క నడుస్తూ బిల్డప్ ఇస్తున్నారు. చూసేవారికి ఇది గొప్పగా ఉంటుంది. వేడుకలకు, బిజినెస్ మీటింగ్స్‌కు వచ్చే అతిథుల కోసం ఎయిర్‌పోర్ట్‌కు బౌన్సర్లను పంపుతున్నారు. కాలేజీ వేడుకలు, ప్రారంభోత్సవాలు, ఔట్‌డోర్ షూటింగ్‌లు... వీటన్నింటికీ బౌన్సర్లు కావాలి. ఎంతమంది బౌన్సర్లుంటే అంత గొప్ప అనే స్థితికి సెలబ్రిటీలు వెళ్లారు. దాంతో వీరి సేవలను సమకూర్చే ఏజెన్సీలు నగరాల్లో పెరిగాయి. మహిళా బౌన్సర్లు కూడా పెరిగారు.



ఇబ్బందిగా మొదలయ్యి...

'మొదట ప్యాంటూ షర్టు వేసుకున్నప్పుడు ఇబ్బందిగా అనిపించింది. ఇంట్లో వాళ్లు కొత్తగా చూశారు. ఇరుగుపొరుగు వారు వింతగా చూశారు. కాని తరువాత అలవాటైపోయింది' అంది పూణెకు చెందిన ఒక మహిళా బౌన్సర్. 2016లో దేశంలోనే మొదటిసారిగా మహిళా బౌన్సర్ల ఏజెన్సీ ఇక్కడ మొదలైంది. ఆ తర్వాత ఢిల్లీ, ముంబై, బెంగళూరులలో ఇలాంటివి వచ్చాయి. ఇప్పుడు కేరళలో ఈ రంగంలోకి వస్తున్నవారు పెరిగారు. 'మేము ఎవరినో రక్షించడానికి వెళుతుంటే మా రక్షణ కోసం కొత్తల్లో కుటుంబ సభ్యులు ఆందోళన పడేవారు. కాని స్త్రీలు ఈ రంగంలో సురక్షితంగా పని చేయొచ్చని నెమ్మదిగా అర్థం చేసుకున్నారు' అని మరో బౌన్సర్ అంది.

రెండు విధాలా ఆదాయం

కొచ్చిలో 'షీల్డ్ బౌన్సర్స్ ఏజెన్సీ'కి చెందిన మహిళా బౌన్సర్లు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా మారారు. ఈవెంట్స్‌లో మహిళా అతిథులకు, స్టేజ్ రక్షణకు, అతిథుల హోటల్ నుంచి ఈవెంట్ వద్దకు తీసుకు రావడానికి వీరి సేవలు ఉపయోగిస్తున్నారు. 'సాధారణంగా ఈవెంట్స్ సాయంత్రాలు ఉంటాయి. బౌన్సర్ల పని అప్పటి నుంచి మొదలయ్యి అర్ధరాత్రి వరకూ సాగుతుంది. కాబట్టి పగటి పూట చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ లేదా ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ మధ్యాహ్నం తర్వాత ఈ పని చేస్తున్నవారూ ఉన్నారు. దాంతో రెండు విధాల ఆదాయం ఉంటోంది' అని ఆ ఏజెన్సీ నిర్వాహకుడు తెలిపాడు.

స్పోర్ట్స్ తెలిసినవారు

స్కూల్, కాలేజీల్లో స్పోర్ట్స్‌లో చురుగ్గా ఉన్న మహిళలు, వ్యాయామం ద్వారా జిమ్ ద్వారా దేహాన్ని ఫిట్‌గా ఉంచుకున్నవారు, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న వారు మహిళా బౌన్సర్లుగా రాణిస్తారు. వెంటనే వారికి పని దొరికే పరిస్థితి ఉంది. దేశంలోని నగరాల్లో వివాహితలు, పిల్లలున్న తల్లులు కూడా వృత్తిలో రాణిస్తున్నారు. 'జనాన్ని అదుపు చేయడం, వారిని ఒప్పించి ఇప్పుడే దూరంగా జరపడం, ఆకతాయిలను కనిపెట్టడం, సెలబ్రిటీలతో వ్యవహరించే పద్ధతి తెలియడం, చట్ట పరిధిలో గొడవలను అదుపు చేయడం తెలిస్తే ఈ వృత్తి లాభదాయకం' అంటున్నారు ఈ మహిళా బౌన్సర్లు.

బ్యూటిప్



మొటిమలు, మచ్చలు పోవాలంటే...

ముఖంపై మృతకణాలను ఎప్పటికప్పుడు తొలగించుకోకుంటే మొటిమలు, మచ్చలు లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలా కాకుండా ఉండాలంటే ఇంట్లో ఆరోగ్యకరమైన స్క్రబ్‌ను తయారు చేసుకోవచ్చు. అందుకు మూడు టీస్పూన్ల బేకింగ్ సోడాలో ఒక టీస్పూన్ ఓట్స్ వేసి కొన్ని నీళ్లతో మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. రోజూ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే ఈ మిశ్రమంతో ముఖాన్ని స్క్రబ్ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



ఆమె... వంటతో జీవితాన్ని నిలబెట్టుకుంటానని, వంటలతో అవార్డులు అందుకుంటానని, వియ్ హబ్ (విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్)కి బ్రాండ్ అంబాసిడర్ అవుతానని కలలో కూడా కలగనలేదు. పాలతో కూరలు వండే గుజరాత్ వాళ్లు ఆమె చేసిన పుదీనా పచ్చడిని లొట్టలేసుకుంటూ తిన్నారు. కొబ్బరి, అరటితో మసాలాలు లేని తేలిక ఆహారం తీసుకునే కేరళ వాసులు కూడా ఆమె చేతి రుచికి ఫిదా అయ్యారు. గోవా వాళ్లకు చేపలతో కొత్త వంటలను పరిచయం చేశారామె. ఈ విజయాలన్నీ ఆమెను రాష్ట్ర సెక్రటేరియట్ వైపు నడిపించాయి. తెలంగాణ సెక్రటేరియట్‌లో క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఆమె పేరు ఆకుల కృష్ణకుమారి. ఊరు మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా, మూడు చింతలపల్లి గ్రామం. నెలకు లక్షకు పైగా ఆర్జిస్తున్న కృష్ణకుమారి జీవితం పలువురికి స్ఫూర్తిదాయకం.

వియ్ హబ్ బ్రాండ్ అంబాసిడర్
వంట గెలిచింది



కృష్ణకుమారి



కృష్ణకుమారి గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఒక ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం చేశారు. ఆ తర్వాత కొంతకాలం ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఫ్రంట్ ఆఫీసర్. తనకు వంటలు చేయడం, వంటల్లో ప్రయోగాలు చేయడం ఇష్టం. ఆ ఇష్టంతో తాను చేసిన కొత్త వంటకాలను కొలీగ్స్‌కి ఇచ్చేవారామె. "మా నాన్న టైలర్. ఓ రోజు సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) డీపీఎమ్ సురేఖ గారు మా షాప్‌కి వచ్చారు. నన్ను చూసి నేను చేస్తున్న పని తెలిసిన తర్వాత ఆమె నాకో డైరెక్షన్ ఇచ్చారు. ఆ ధైర్యంతోనే నా కుటీర పరిశ్రమ మొదలైంది. తొలి ఆర్డర్ యూఎస్‌కి, డాక్టర్ గీతాంజలి మేడమ్ పది వేల రూపాయల ఆర్డర్ ఇచ్చారు. అలా మొదలైన నా జర్నీ ఇప్పుడు నెలకు లక్ష రూపాయలకు పైగా ఆదాయంతో విజయవంతంగా సాగుతోంది. మిల్లెట్స్‌తో ప్రయోగాలు నన్ను నిలబెట్టాయి." అన్నారు కృష్ణకుమారి.

మహిళాశక్తి క్యాంటీన్

డ్వాక్రా స్వయంసహాయక బృందంలో చేరిన తర్వాత తన కార్యకలాపాలను వేగవంతం చేశారు కృష్ణకుమారి. హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఎన్ఐఆర్‌డీలో శిక్షణ తీసుకోవడంతో పాటు, తన ఉత్పత్తులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ వంటి ప్రక్రియలన్నీ పూర్తి చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టడంతో మొదలైన ఆమె జర్నీ సరస్ మేళా ఎగ్జిబిషన్‌లతో అండమాన్, కశ్మీర్ మినహా దేశమంతటికీ విస్తరించింది. ఆమె విజయ పథం... ఎగ్జిబిషన్‌లో స్టాల్ కోసం అధికారులను అడగాల్సిన దశ నుంచి ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో స్టాల్ పెట్టవలసిందిగా కలెక్టర్ ఆఫీస్ నుంచి ఫోన్ కాల్ వచ్చే దశకు చేరింది.

చిన్న రైతులే

నా ఉత్పత్తులకు స్వాద్ అనే బ్రాండ్‌నేమ్ రిజిస్టర్ చేశాను. పరిశ్రమ దమ్మాయిగూడలో ఉంది. ఆరుగురు మహిళలు పని చేస్తున్నారు. నేను ఉదయం తొమ్మిదిన్నరకు సెక్రటేరియట్‌కు చేరుకుంటాను. తిరిగి ఇంటికి చేరేటప్పటికి రాత్రి పదవుతుంది. యూనిట్‌లో నిన్న తయారైన మెటీరియల్‌ను ఈ రోజున కౌంటర్‌లో పెడతాను. ఏ రోజుకారోజు అమ్ముడైపోతాయి. సెక్రటేరియట్ క్యాంటీన్‌తోపాటు యూనిట్‌లోనే అవుట్‌లెట్ కూడా ఉంది. రాపిడో ద్వారా సప్లయ్ చేస్తున్నాం. వినియోగదారులు మా దగ్గరకు రావడం కంటే మేమే వినియోగదారుల దగ్గరకు వెళ్లాలనే ఉద్దేశంతో మొబైల్ యూనిట్ ప్రారంభించనున్నాను. నా సక్సెస్‌కి కారణం తోటలే. పచ్చళ్లు, పొడులు ఏవి చేయాలన్నా కూరగాయలు మార్కెట్ నుంచి తెచ్చుకోను. నేరుగా తోటలకే వెళ్లి తెచ్చుకుంటాను. భారీ స్థాయిలో పండించే వాళ్లు స్వయంగా మార్కెట్‌కు తరలించగలుగుతారు. చిన్న రైతులు తమకు తాముగా మార్కెట్‌కి తీసుకెళ్లాలంటే ఆ ఖర్చులు భరించలేరు. నేను వారి దగ్గర తీసుకుంటాను. నేను ఇష్టంతో ఎంచుకున్న ప్రొఫెషన్. నాకు ఉపాధినివ్వడంతోపాటు గుర్తింపును కూడా తెచ్చింది. ఇందులోనే భవిష్యత్తును నిర్మించుకుంటాను. మహిళల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మహిళలకు తెలియడం లేదు. ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించడం కోసం పని చేస్తాను.

– ఆకుల కృష్ణకుమారి, స్వాద్ ఫుడ్స్





తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గత ఏడాది జూన్ నెల రెండవ తేదీన జరిగిన వేడుకల్లో ఆమె స్టాల్ పెట్టారు. ఆ స్టాల్‌లోని ఉత్పత్తులను ఆసాంతం పరిశీలించిన మంత్రులు, ముఖ్యమంత్రి ఆమె అక్కడికక్కడే లైవ్ కౌంటర్‌లో వండిన తెలంగాణ రుచులకు కూడా సంతృప్తి చెందారు. డ్వాక్రా మహిళల కోసం శాశ్వతంగా ఒక వేదికను ఏర్పాటు చేయవలసిందిగా కోరడంతో 'సెక్రటేరియట్ క్యాంటీన్ మహిళలకే ఇద్దాం' అని నోటిమాటగా వచ్చిన ఉత్తర్వుతో అదే నెల 21న ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ మొదలైంది. అందులో కృష్ణకుమారితో పాటు పదిమంది మహిళలు తమ ఉత్పత్తులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. జయహో మహిళాశక్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

లీగల్

పెళ్లి సంగతి తర్వాత... కౌన్సెలింగ్ ఇప్పించండి

మా అక్క తన విడాకుల అనంతరం మాతోనే ఉంటున్నారు. తనకి ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురి వయసు 29 సంవత్సరాలు. గత ఎనిమిది సంవత్సరాలుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నాము. 2023వ సంవత్సరంలో ఒక అబ్బాయి పెళ్లి చూపులకు వచ్చినప్పుడు "నేను మరొకరిని ప్రేమిస్తున్నాను అని చెప్పింది" కానీ ఆ అబ్బాయి వివరాలు ఇవ్వలేదు. మేమే ఎలాగోలా అతని ఫోన్ నెంబర్ తెలుసుకుని అబ్బాయిని సంప్రదించగా తనకు జాబ్ వచ్చిన తరువాత మాత్రమే తమ ప్రేమ విషయం ఇంట్లో చెప్తాను అన్నాడు. తన కుటుంబ వివరాలు కూడా మాకు ఇవ్వలేదు. వారిది వైజాగ్ అని మాత్రమే తెలుసు. అమ్మాయిని వేరే సంబంధం చేసుకోమంటే మా మాట వినటం లేదు. ఎలా అయినా సరే అతన్నే పెళ్లి చేసుకుంటాను అంటుంది. ఇలా అయితే లాభం లేదు, ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని గట్టిగా చెప్పాము. అయినా లాభం లేదు. ఇటీవలే అబ్బాయికి ఉద్యోగం వచ్చినట్లు తెలిసింది కానీ, తర్వాత నుంచి మా మేనకోడలితో కూడా మాట్లాడడం మానేశాడు. మా అక్కకి ఆ అబ్బాయితో సంబంధం ఇష్టం లేదు. పరిష్కారం చూపగలరు.

– విజయ, హైదరాబాద్

మీ మేనకోడలు ఒక మేజర్. చట్టప్రకారం తను ఎవరిని పెళ్లి చేసుకోవాలి – ఎవరితో కలిసి బతకాలి, అసలు పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుంది. అందులో మూడో వ్యక్తి జోక్యం చేసుకోవటాన్ని చట్టం అంగీకరించదు.అది తల్లిదండ్రులైనా సరే! ఏమి చేసినా ఆ అమ్మాయి అంగీకారంతో మాత్రమే చేయవలసి ఉంటుంది. మీరు చెప్పినదాన్ని బట్టి చూస్తే ఆ అబ్బాయికి ఇంక ఇంట్రెస్ట్ లేనట్టు కనిపిస్తుంది. బహుశా మీ అమ్మాయి ఈ విషయం జీర్ణించుకున్నట్లు లేదు. తనకు కౌన్సిలింగ్ అవసరం అనిపిస్తుంది. మీ అమ్మాయి అతన్ని మాత్రమే పెళ్లి చేసుకుంటాను అనడానికి గల కారణం ఏమిటో ప్రేమగా మాట్లాడి తనకి ధైర్యాన్ని ఇస్తూ కనుక్కోండి. పరస్పర అంగీకారంతో ప్రేమించుకున్నట్టైతే సరేం అలా కాదు ఏదైనా వేరే కోణం ఉందేమో తెలుసుకోండి. శారీరక సుఖం కోసం ప్రేమిస్తున్నాను అంటూ వెంటపడుతూ కోరిక తీరినాక మోస పూరితంగా వదిలేస్తే, అందుకు తగిన శిక్షలు భారతీయ న్యాయ సంహితలో వున్నాయి. కఠిన చర్యలు తీసుకోవచ్చు. ఏది ఏమైనా, ఈ సమయంలో మీరు తనపై మరింత ఒత్తిడి పెట్టడం సరైనది కాదు. మీరు కలిగించే ధైర్యం–నమ్మకం తనకు చాలా అవసరం. కాబట్టి పెళ్ళి సంగతులు కాసేపు పక్కనబెట్టి ముందు తన మానసిక పరిస్థితి, తనకు ఏం కావాలి అనే అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేయండి. వీలైతే కౌన్సెలింగ్ ఇప్పించండి.



- శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

సేవాపథం

పేదోళ్ల వకీలమ్మ



సరళ మహేందర్‌రెడ్డి

'న్యాయవాది కావడం అనేది కేవలం వృత్తికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడం... సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యతను ఎప్పుడూ గుర్తు పెట్టుకోవడం కూడా' అనే ప్రసిద్ధ మాటను న్యాయవాదుల గురించి చెబుతుంటారు.

నిజామాబాద్‌కు చెందిన కాటిపల్లి సరళ మహేందర్‌రెడ్డి న్యాయవాదిగా పేదలకు అండగా ఉండటమే కాదు...'సమాజానికి తిరిగి ఇవ్వాలి' అనే ఎరుకతో తన పాఠశాల ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. పిల్లలు వివిధ ఆటల్లో జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తోంది.

సామాజిక సేవే... విలువైన సంపద

న్యాయవాదిగా పేదలకు అండగా నిలవడమే కాదు సామాజికసేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాల్లో భాగం కావాలనుకుంటున్నాను.

– సరళ మహేందర్‌రెడ్డి

డిగ్రీ చదువుతున్నప్పుడే వివాహం అయినప్పటికీ భర్త, హైకోర్ట్ న్యాయవాది మహేందర్‌రెడ్డి ప్రోత్సాహంతో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన సరళ నిజామాబాద్ జిల్లా కోర్టులో ఎన్‌రోల్ అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి మహిళా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసింది. ఉమ్మడి ఏపీ హైకోర్టులో ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా విశాఖ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల బాధ్యతలు చూసింది.

రోడ్డు ప్రమాదంలో మరణించిన తన బావగారు (భర్త అన్న) కాటిపల్లి రవీందర్‌రెడ్డి పేరుమీద ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసి నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నారు. బీఈడీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 300 మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించారు. ఈ ఏడాది నుంచి 'బాలసదన్'లో ఉంటున్న 30 మంది అనాథ పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్నారు. 'బాలసదన్' చిన్నారుల కోసం జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భవిష్య జ్యోతి' ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా సరళ మహేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.



ఆటల్లో మెరిసేలా...

గ్రామీణ విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించేందుకు 'ఖేలో ఇండియా' కార్యక్రమాలు పాఠశాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఖోఖో ఆటలను స్పాన్సర్ చేస్తున్నారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు హాకీలో జాతీయ స్థాయిలో ఆడారు. రెండు సార్లు రాష్ట్రస్థాయి జూడో మీట్ నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు జూడోలో రాష్ట్రస్థాయిలో అండర్–17 విభాగంలో 3 కాంస్య పతకాలు సాధించారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ సైతం జూడో రాష్ట్ర స్థాయిలో ఆడుతున్నారు.

– తుమాటి భద్రారెడ్డి, సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

గ్లోబల్ టు లోకల్


జర్మన్ అమ్మాయి... మలయాళం ఎంత చక్కగా మాట్లాడిందో!

విదేశాలకు వెళ్లడం, కొత్త కొత్త ప్రదేశాల్లో విహరించడం బాగానే ఉంటుంది కానీ భాషా సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. కొందరు వేరే దేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్థానిక భాషలు వారికి ఎప్పుడూ పరాయిగానే ఉండిపోతాయి. ఎందుకంటే వారు ఎప్పుడూ మాట్లాడరు... మాట్లాడాలని ప్రయత్నించరు!

'నేర్చుకోవాలనే తపన ఉంటే... ఏ భాష అయినా మాట్లాడవచ్చు' అని చెప్పే వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

క్లారా అనే జర్మనీ అమ్మాయి కొంత కాలంగా మన దేశంలో నివసిస్తోంది. ఆమె ఉబర్ క్యాబ్ డ్రైవర్‌తో స్పష్టమైన మలయాళంలో మాట్లాడుతున్న వీడియో క్లిప్ చూసి నెటిజనులు 'ఆహా' అంటున్నారు.

'ఇంగ్లీష్ మాట్లాడే ఫారినర్స్‌నే చూశాను గానీ ఇంత చక్కగా మలయాళం మాట్లాడే ఫారినర్‌ను చూడడం ఇదే మొదటిసారి' అని క్యాబ్‌డ్రైవర్ బోలెడు ఆశ్చర్యపోయాడు.



● ఆర్ట్ అండ్ కల్చర్

పాకిస్థాన్‌లో... ప్యార్ కియాతో డర్నా క్యా!

దేశాల మధ్య ఎంత దూరమైనా ఉండవచ్చు. ఎంత శత్రుత్వమైనా ఉండొచ్చు. అయితే కళకు ఆ దూరం తెలియదు. ఆ శత్రుత్వం తెలియదు.

'మొఘల్–ఎ–ఆజం' అనే సినిమా పేరు వినగానే ఒళ్లు పులకరించిపోతుంది. కాలాతీతమైన ప్రేమ కావ్యం ఇది. ఈ సినిమాకు మన దేశంలో ఎంత ఆదరణ, అభిమానం ఉందో పాకిస్తాన్ లోనూ అంతే. పాక్‌లో ఈతరం ప్రేక్షకులు కూడా ఈ సినిమాను సొంతం చేసుకోవడం విశేషం. తాజా విషయానికి వస్తే...

పాకిస్థాన్‌లోని గవర్నమెంట్ కాలేజీ యూనివర్శిటీ (జిసియూ) విద్యార్థుల బృందం ఈ ఐకానిక్ చిత్రానికి నీరాజనం అర్పించింది.



'మొఘల్–ఎ–ఆజం' చిత్రంలో ఓ సన్నివేశం

'మొఘల్–ఎ–ఆజం' సినిమాను నాటకంగా ప్రదర్శిస్తే ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన ఇంతా అంతా కాదు!